నెలకు సెల్‌ఫోన్ రీచార్జి రూ.3 వేలట

- ఏడాదికి రూ.40 వేలు, రూ.30 వేలు బిల్లుల మంజూరు
- ఇదీ సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బాగోతం

సాధారణంగా మనం వాడే ఫోన్లను నెలకోసారి రీచార్జి చేసుకుంటాం. రోజుకు 1.5 జీబీ నెట్ వచ్చే ప్యాకేజీని జియో అయితే రూ.239కు అందిస్తుంది. ఇలాగే ఒక్కో కంపెనీ ఒక్కో ఆఫర్ పెడుతూ ఉంటుంది. కంపెనీని బట్టి నెలకు రూ.250 వేసుకున్నా, ఏడాదికి రూ.3వేలు దాటదు. కానీ, జిల్లాలోని కొన్ని హాస్టళ్లలో సిమ్ రీచార్జి బిల్లు ఏడాదికి ఏకంగా రూ.40 వేలు పెట్టుకున్నారు. మరికొన్ని హాస్టళ్లలో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు డ్రా చేసుకున్నారు. జిల్లా అధికారి సహకారంతో ఇలా ఎక్కువ మొత్తంలో బిల్లులు పెట్టుకుని పైనుంచి కింది స్థాయి వరకు అందరూ కలిసి పంచుకున్నట్లు అధికార వర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

- చిత్తూరు





జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 57 వసతి గృహాలు ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పీజీ వరకు సుమారు మూడువేల మంది విద్యార్థులు ఆశ్రయం పొందు తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వసతిగృహాల్లో ఆశ్రయం పొందు తున్న విద్యార్థుల హాజరుపై తప్పుడు బిల్లులు పెట్టి ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయి. దాంతో విద్యార్థుల హాజరును బయో మెట్రిక్ ద్వారా నమోదు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వసతి గృహా లకు ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లోనే పలు నెట్‌వర్క్ కంపెనీలతో జిల్లాస్థాయిలో చర్చలు జరిపారు. అనంతరం ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి రావడంతో ఇంటర్నెట్ ప్రొవైడింగ్ సిస్టం మరుగునపడిపోయింది.

సొంత ఫోనుతోనే అటెండెన్సు..

వసతిగృహాల్లో విద్యార్థుల అటెండెన్స్ వేసేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వలేదు. వార్డెన్లందరూ సొంతంగా ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతుండడంతో ప్రస్తుతం వారి ఫోన్ల నుంచే బయోమెట్రిక్ అటెండెన్స్‌ను నమోదు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో హాస్టల్‌కు ఏడాదికంతా రూ.3వేలు మించదు. ఈ మొత్తాలను వార్డెన్లు వారి సొంతానికి వాడుకునే ఇంటర్నెట్‌తోపాటు హాస్టల్ విద్యార్థులకు కూడా వాడుతున్నారు. తాను వినియోగించని ఇంటర్నెట్‌కు రూ.3 వేల చార్జీలతో అందిన బిల్లును తనకొద్దంటూ పలమనేరు ప్రాంతానికి చెందిన ఓ వార్డెన్ ఆ బిల్లును తిరిగి ఇచ్చేశాడు.

నకిలీ బిల్లులతో నిధులు కొట్టేసి..

ఇటీవల ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖకు ఇచ్చిన బడ్జెట్‌లో నుంచి కొంత మొత్తాన్ని ఇలా ఇంటర్నెట్ బిల్లుల కోసం కేటాయించారు. 2023 ఏడాదికి సంబంధించిన బిల్లుల్ని మంజూరు చేసుకోగా, ఆయా నెట్‌వర్క్‌ల పేరుతో నకిలీ బిల్లుల్ని సబ్‌మిట్ చేసి నిధుల్ని కొట్టేశారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఓ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న పాత సామాన్లను పైఅధికారులకు తెలియకుండా ఓ వార్డెన్ అమ్మేశాడు. ఆ శాఖ ఉన్నతాధికారికి నమ్మిన బంటు అని చెప్పుకుంటున్న ఆయనే బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్‌తోపాటు మిగిలిన కంపెనీల నకిలీ బిల్లులను తయారు చేశారు. ఒక్కో నకిలీ బిల్లు తయారీకి రూ.1000 నుంచి రూ.1500 వరకు తీసుకున్నట్లు సమాచారం.



జియో కంపెనీ పేరుతో సృష్టించిన తప్పుడు బిల్లు

అనువైన వారికి అధిక మొత్తం..

జిల్లాలో ఉన్న 57 మంది వార్డెన్లలో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా బిల్లులు పెట్టారు. ఆ శాఖ ఉన్నతాధికారికి అనుకూలంగా ఉన్న వార్డెన్లకు రూ.40 వేల వరకు బిల్లులు పెట్టగా.. అనుకూలంగా లేనివారికి రూ.3వేల నుంచి రూ.5వేల మధ్యలో బిల్లులు పెట్టారు. ఈవిధంగా జీడీనెల్లూరు వార్డెన్‌కు (గర్ల్స్, బాయ్స్) రూ.40 వేలు, పూతలపట్టు బాలికల హాస్టల్ వార్డెన్ పేరు మీద రూ.10వేలు, ఉగ్రాణంపల్లె వార్డెన్‌కు రూ.30వేలు, కొత్తపల్లెమిట్ట వార్డెన్‌కు రూ.30వేలు, తూగుండ్రం వార్డెన్‌కు రూ.30వేలుగా బిల్లులు పెట్టారు. మిగిలిన వార్డెన్లకు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు బిల్లులు పెట్టారు. మంజూరైన డబ్బుల్లో జిల్లా స్థాయిలో ఓ అధికారికి 60 శాతం, ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్లకు కలిపి 40శాతం పంచుకున్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం జిల్లాలో ప్రశాంతంగా మొదలయ్యాయి. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, తమిళం లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. 13,800 మంది విద్యార్థులకుగాను 13,134 మంది హాజరవగా, 666 మంది గైర్హాజరయ్యారు. డీవీఈవో, పరీక్షల కన్వీనర్ సయ్యద్ మౌలా ఏడు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పరీక్షల కమిటీ తొమ్మిది సెంటర్లు, స్క్వాడ్ ఎనిమిది సెంటర్లు పరిశీలించారు.

టెట్‌కు 1106 మంది హాజరు

ఐదో రోజైన శనివారం జిల్లాలోని నాలుగు, తమిళనాడులోని ఒక్క సెంటర్‌లో నిర్వహించిన టెట్ పరీక్షలకు 1106 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు.

ఆర్మీలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, మార్చి 2: ఇండియన్ ఆర్మీలోని అగ్నివీర్‌లో వివిధ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సైనిక సంక్షేమాధికారి విజయశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ టెక్నికల్, జనరల్ డ్యూటీ, నాన్ టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మ్యాన్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్ విద్యార్హతతో 17-21 ఏళ్లలోపువారు అర్హులన్నారు. సందేహాల నివృత్తికి 08622 30008 నెంబరును, వివరాలకు www.joinindianarmy.nic.in ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతలకు వేధింపులపై మూడ్రోజుల్లో నివేదిక ఇవ్వండి

కలెక్టర్, ఎన్నికల అధికారికి సీఈవో ఆదేశం

కుప్పం, మార్చి 2: చిత్తూరు జిల్లాలోని కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో టీడీపీ నాయకులపై వేధింపులు, విచక్షణా రహితంగా రౌడీషీట్లు తెరవడం వంటి ఆరోపణలపై మూడ్రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ హరీంద్ర ప్రసాద్ ఆదేశించారు. ఈమేరకు ఆయన ఫిబ్రవరి 27న వారికి జారీ చేసిన మెమో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుప్పం అసెంబ్లీ సెగ్మెంట్‌లో టీడీపీ కేడర్‌పై పోలీసుల వేధింపులు, విచక్షణా రహితంగా రౌడీషీట్లు తెరవడం వంటివాటిపై గతంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు సీఈవోకు లేఖ రాశారు. ఈ లేఖను ప్రస్తావించిన సీఈవో, దీనిపై ఎస్పీనుంచి రిమార్కులు కోరాలని, ఈసీఐ నిబంధనల ప్రకారం బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా మెమోలో ఆదేశించారు.



చిత్తూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద సీకే బాబు

టీడీపీ కార్యక్రమాలు అడ్డుకోవడానికేనా?

పోలీసు 30 యాక్టు అమల్లోకి తేవడంపై విమర్శలు

చిత్తూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ చిత్తూరు పోలీసులు ఏకపక్షంగా పనిచేస్తూ టీడీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెడుతున్న విషయం తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ ఇబ్బందులు మరింత పెరిగాయి. చిత్తూరులో వైసీపీ నాయకులు నిర్వహించే ర్యాలీలు, సమావేశాలకు వెంటనే అనుమతులిచ్చి, ట్రాఫిక్‌ను మళ్లించే పోలీసులు.. టీడీపీ కార్యాక్రమాల్ని అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అందుకే హడావిడిగా పోలీసు 30 యాక్టును అమల్లోకి తెచ్చారు. ఇకనుంచి ప్రతి ర్యాలీ, సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరని ప్రకటించారు. ఎలాగూ వైసీపీ కార్యక్రమాలకు వెంటనే అనుమతులు ఇచ్చేసి, టీడీపీ కార్యక్రమాలను అడ్డుకునేందుకే ఈ యాక్టును తెరపైకి తెచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గురజాలకు మద్దతుగా బెంగళూరు నుంచి కార్ల ర్యాలీ

టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు మద్దతుగా బెంగళూరులో నిర్మాణ రంగంలో స్థిరపడిన తెలుగు వారంతా సుమారు 300 కార్లలో ఆదివారం ర్యాలీ నిర్వహిస్తున్నారు. దీనికి అనుమతి కోసం టీడీపీ నాయకులు వారం ముందే పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. రకరకాల కొర్రీలతో వాయిదా వేస్తూ వచ్చి శనివారం రాత్రి అనేకరకాల ఆంక్షలతో అనుమతులిచ్చారు.ఆంక్షల పేరుతో కార్ల ర్యాలీని విజయవంతం చేయకుండా పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అలాగే తనకు ఎమ్మెల్యే టికెట్ ప్రకటించిన తర్వాత అభిమానులతో కలిసి మురకంబట్టు నుంచి ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్ వద్ద పోలీసులు ఆ ర్యాలీని అడ్డుకున్నారు.ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూల వేసేందుకు కూడా పోలీసులు అంగీకరించలేదు. వాగ్వాదం తర్వాత ఆంక్షలతో అనుమతిచ్చారు.

వైసీపీ సమావేశాలకు దగ్గరుండి పర్యవేక్షణ

ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని వైసీపీ అధిష్ఠానం అభ్యర్థిగా ప్రకటించింది. అప్పటి నుంచి ఆయన నిత్యం వివిధ వర్గాల, సామాజికవర్గాల సమావేశాలను నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో నిర్వహించే సమావేశాలకు పోలీసులు తక్షణమే అనుమతులిచ్చేసి జీ హుజూర్ అంటున్నారు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నా.. దగ్గరుండి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఆ మధ్య సామాజిక బస్సు యాత్రను ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద ప్రధాన రహదారిని బ్లాక్ చేసి మరీ అనుమతులిచ్చారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. చిత్తూరులో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరును నగరవాసులు విమర్శిస్తున్నారు.

సీకే బాబు ప్రకటనతో అదుపులోకి అనుచరులు..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మళ్లీ యాక్టివ్ కానున్నారు. ఈ మేరకు తన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేందుకు ఆదివారం తన నివాసంలో ఆత్మీయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి రావాలని ఆయన అనుచరులు ఇద్దరు నగరంలోని సీకే వర్గానికి ఫోన్లు చేశారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆ ఇద్దరు అనుచరుల్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న సీకే బాబు చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అదుపులో ఉన్న అనుచరుల కోసం పోలీసులతో మాట్లాడారు. ఆత్మీయ సమావేశమంటూ సీకే బాబు ప్రకటనతో వైసీపీ నాయకుల్లో అలజడి మొదలైంది. ఆయన టీడీపీకి మద్దతిచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నారు. అందుకే పోలీసులను అస్త్రంగా ఉపయోగించి ఇబ్బంది పెట్టడం ప్రారంభించారు. ఆదివారం సీకే అభిమానులు ఆయన ఇంటికి సమావేశానికి హాజరు కానున్నారు. ర్యాలీగా వెళ్లొద్దంటూ పోలీసులు ఆంక్షలు పెట్టారు.

బావిలో జారిపడి ద్రావిడ వర్సిటీ విద్యార్థి మృతి

గుడుపల్లె, మార్చి 2: ఈత సరదా కోసం స్నేహితులతో కలిసి వెళ్లిన ద్రావిడ వర్సిటీ విద్యార్థి ఒకరు ప్రమాదవశాత్తూ బావిలో జారి పడి మృతి చెందాడు. ఈ దుర్ఘటన గుడుపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెద్ద నందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన రాములు కుమారుడు సాత్విక్(23) ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టడానికి విశ్వవిద్యాలయానికి కొంత దూరంలో ఉన్న ఎ.కొత్తపల్లె గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. స్నేహితులంతా బావిలో ఈత కొట్టి.. గట్టుకు వచ్చారు. సాత్విక్ మాత్రం కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి బావి మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న స్థానికులొచ్చి సాత్విక్‌ని బావి నుంచి బయటకు తీశారు. 108కి సమాచారం ఇవ్వడంతో వైద్యసిబ్బంది వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సాత్విక్ (ఫైల్ ఫొటో)

మూడు కుటుంబాల్లో విషాదం

- సముద్ర స్నానానికెళ్లిన ముగ్గురు విద్యార్థుల గల్లంతు
- ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఒకరి మృతదేహం

పలమనేరు, మార్చి 2: పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (డెయిరీ సైన్స్) చదువుతున్న విద్యార్థుల్లో ఓ 18 మంది విహార యాత్ర కోసం శుక్రవారం రాత్రి చెన్నై సమీపంలోని మహాబలిపురానికి వెళ్లారు. శనివారం ఉదయం పర్యాటక ప్రదేశాలను చూస్తూ సరదాగా గడిపారు. తర్వాత అక్కడున్న బీచ్‌లోకి సంతోషంగా దిగారు. వీరిలో మౌనిష్ (19), విజయ్ కుమార్(19), ప్రభు (18) గల్లంతయ్యారు. విజయ్‌కుమార్ మృతదేహం మాత్రం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈ దుర్ఘటన.. మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

మనవడి కోసం..

సదుం, మార్చి 2: ప్రభు.. సదుం మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ పెదకంటివారిపల్లెకు చెందిన శివరాణి కుమారుడు. పులిచెర్ల మండలానికి చెందిన శ్రీనివాస్‌తో శివరాణికి వివాహమైంది. భర్త చనిపోవడంతో పదేళ్లుగా పుట్టింట్లోనే కుమార్తె, కుమారుడితో శివరాణి ఉంటున్నారు. విషయం తెలియడంతో ప్రభు అమ్మమ్మ సిద్ధమ్మను ఓదార్చడం ఎవ్వరి తరమూ కావడం లేదు. పల్లెలోనూ విషాదఛాయలు నెలకొంది.



రోదిస్తున్న ప్రభు అమ్మమ్మ సిద్ధమ్మ



విషాదంలో విజయ్ కుమార్ తల్లిదండ్రులు

మూడు నెలల్లో బిడ్డల చదువు పూర్తవుతుంది

- విజయ్‌కుమార్, మౌనిష్ తల్లిదండ్రులు

బంగారుపాళ్యం, మార్చి 2: విజయ్‌కుమార్, మౌనిష్‌లది బంగారుపాళ్యం మండలంలోని నలగాంపల్లె పంచాయతీ కేసీ కండ్రిగ గ్రామం. విజయ్‌కుమార్ తల్లిదండ్రులు లత, తులసీరామ్. మౌనిష్ తల్లిదండ్రులు రామాంజలి, చంద్రబాబు. వీరికి విషయం తెలియడంతో బోరున విలపిస్తున్నారు. గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల్లో తమ బిడ్డల చదువు పూర్తవుతుందని, ఈ సమయంలో ఇలా జరిగిందని తల్లిదండ్రులు వాపోయారు.



రోదిస్తున్న మౌనిష్ కుటుంబీకులు

జడ్పీటీసీకి లేని ప్రొటోకాల్ మంత్రి రోజా అన్నకెవరు ఇచ్చారు?

- వడమాలపేట వైసీపీ జడ్పీటీసీ మురళీధర రెడ్డి

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2: జడ్పీటీసీలకు లేని ప్రొటోకాల్ మంత్రి రోజా అన్నకు ఎవరిచ్చారని వడమాల పేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వడమాలపేటలో రూ.50లక్షల తుడా నిధులతో సీసీ డ్రెయిన్లు నిర్మించడానికి చేసిన భూమిపూజలో ఏ అధికారంతో రోజా అన్న రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ములతో కలిసి నగరి నియోజక వర్గాన్ని రోజా దోచేస్తున్నారని ఆరోపించారు. తాను జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో గత నెల 25న అప్పలాయ గుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో పాలశీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తే అవే భవనాలను శనివారం మంత్రి రోజా ప్రారంభించడమేంటన్నారు. ఏ ప్రజాప్రతినిధికీ ఇంతటి ఘోరావమానం జరక్కూడదన్న ఆయన అధికారులపై ప్రైవేటు కేసు వేస్తున్నానని స్పష్టం చేశారు. అప్పలాయగుంటలో ప్రజలెవరూ మంత్రి రోజా కార్యక్రమానికి రాకపోవడంతో అక్కడ రద్దు చేసుకుని పత్తిపుత్తూరులో పాల శీతలీకరణ కేంద్రాన్ని, సచివాలయాన్నీ తనకు సమాచారం ఇవ్వకుండా వలంటీర్లు, ప్రభుత్వ అధికారులతో ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే నగరి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ క్యాడర్ రోజాపై అసంతృప్తితో ఉన్నారని, ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకు ఇస్తే గెలిపించుకుంటామని వైసీపీ అధిష్ఠానానికి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధికారులను మంత్రి రోజా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు, భాస్కర్‌రెడ్డి, పరంధామయాదవ్, వాసుదేవరెడ్డి, జయచంద్రా రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి తదితరులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అకాల మరణం

పుట్టిన రోజునాడే గుండెపోటుతో మృతి

గంగాధరనెల్లూరు, మార్చి 2: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు గుండెపోటుతో మృతి చెందాడు. పుట్టిన రోజునాడే ఈ సంఘటన జరగడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు (దిగవూరు)కు చెందిన విశ్రాంత జడ్పీ సీఈవో సుధాకర్ పిళ్లై కుమారుడు సుధీర్ (40) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పి.. కొంత విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని నిద్రపోయాడు. శనివారం తెల్లవారు జామున ఆయన భార్య నిద్రలేపడానికి ప్రయత్నించగా శరీరం చల్లబడిపోయి ఉంది. వెంటనే ఆమె ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుధీర్‌కి శనివారం పుట్టినరోజు కావడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. బిడ్డ ఇకలేడన్న విషయం తెలియడంతో గంగాధరనెల్లూరులోని సుధాకర్ పిళ్లై రోదనలు మిన్నంటాయి.



సుధీర్ (ఫైల్ ఫొటో)

పుంగనూరులో నేడు ధర్మ పోరాట సభ

పుంగనూరు, మార్చి 2: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పుంగనూరులో ధర్మ పోరాట సభ నిర్వహిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో రైతుల శ్రమదోపిడీ, నిరుద్యోగ సమస్య, బడుగుబలహీన వర్గాల సమస్యలు, తదితర అంశాలపై సభలో ప్రస్తావించడం జరుగుతుందన్నారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు పుంగనూరులోని చదళ్ల-కాటిపేరి రోడ్డులోని తన మామిడి తోటలో జరిగే ఈ కార్యక్రమానికి బీసీవై కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీకాళహస్తికి ఉత్సవ కళ





భక్తకన్నప్ప

ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణలు

●ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్కంటి ఆభరణాలు


శ్రీకాళహస్తి, మార్చి 2: భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ముక్కంటి ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలు కొత్త రంగులతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనల పైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి.భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంకు లాకర్లో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఆభరణాలను శనివారం ముక్కంటి ఆలయానికి చేర్చారు. ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు ఈ ఆభరణాలను ధరిస్తారు.



ఆలయంలో పూల అలంకరణలు

కన్నప్ప ధ్వజారోహణంతో నేడు ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలి పూజ చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అలంకార మండపం నుంచి భక్త కన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు.



కన్నప్ప ఆలయం

ఎంఎస్ఎంఈ సర్వే పకడ్బందీగా చేయాలి : కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 2: మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్ (ఎంఎస్ఎంఈ) సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. రెవెన్యూ, రీ సర్వే మూడో దశ ఇనామ్, అసైన్డ్ భూములు, ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, హౌసింగ్, పీఆర్అండ్ డీఆర్, ఎన్ఆర్ఈజీఎస్, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీటి ఎద్దడి, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకు భూ కేటాయింపులు, ఆరోగ్యం, వైద్య, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్‌పోలియో తదితర అంశాలపై శనివారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని వివిధ శాఖాధికారులతో పైఅంశాలపై సమీక్షించారు. మూడోదశ రీసర్వేకి సంబంధించి 74 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. 20213 హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయగా, 82,483 ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 315807 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తి చేయగా, ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలన్నారు.

సమీక్షలు - సమావేశాలు

అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, మార్చి 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి ముందస్తు అనుమతుల్లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు 30 యాక్టు అమల్లోకి వచ్చిందన్నారు. చిత్తూరు ఒకటి, రెండో పోలీసుస్టేషన్లతోపాటు తాలూకా పోలీసుస్టేషన్, జీడీ నెల్లూరు, ఎస్ఆర్‌పురం, పెనుమూరు, యాదమరి, గుడిపాల, తవణంపల్లె, కాణిపాకం, పూతలపట్టు, ఐరాల, కల్లూరు, రొంపిచెర్ల పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఈ స్టేషన్ల పరిధిలో సభలు, సమావేశాలు జరపాలనుకుంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

గుడుపల్లె,మార్చి2:కులాంతర వివాహం కారణంగా తల్లిదండ్రులు మాట్లాడలేదని మానసిక ఆవేదన చెంది ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఒంటిపల్లెకు చెందిన మునిరాజు, నీలమ్మల కుమార్తె లక్ష్మి (18) ఏడాదిక్రితం కోటచెంబగిరి గ్రామానికి చెందిన వెంకటేశు కుమారుడు లోకేష్‌ను కులాంతర వివాహం చేసుకుంది. వివాహం జరిగినప్పటి నుంచి ఈమెతో తల్లిదండ్రులు మాట్లాడడంలేదు. కొన్నిసార్లు పుట్టింటికి వెళ్లినా వారు ఇక్కడకు రాకూడదని లక్ష్మితో పలుమార్లు గొడవపడ్డారు. దీంతో లక్ష్మి భర్త లోకేష్, ఇరుగుపొరుగు వారితో ఈ విషయం చెప్పి బాధపడేది. శుక్రవారం మానసిక ఆవేదన చెందిన లక్ష్మి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని శవాన్ని కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 59,646 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,938 మంది తలనీలాలు సమర్పించారు.

బస్సును ఢీకొన్న లారీ : 35మందికి గాయాలు



లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు - తీవ్రంగా గాయపడ్డ సర్పంచు షర్మిల, సుబ్బయ్య

పెళ్లకూరు, మార్చి 2:పెళ్లకూరు మండల పరిధిలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు...నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి తిరుపతికి 55మంది ప్రయాణికులతో బయలు దేరింది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వస్తున్న లారీ ఈ బస్సును ఎదురుగా వేగంగా ఢీనడంతో బస్సు డ్రైవర్ రవీంద్రతో పాటు 35మందికి గాయాలయ్యాయి.పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిల, పైడాం వెంకటసుబ్బయ్య, పొదలకూరు మండలం చాడగుట్ల గ్రామానికి చెందిన కలివేటి సుబ్బయ్య, మణికుమారి తదితరులకు తీవ్రగాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హథీరాంజీ మఠం భూములు కొని మోసపోవద్దు

ఎప్పటికైనా ఆక్రమణలను తొలగిస్తాం - మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి):ప్రజలెవరూ హథీరాంజీ మఠానికి చెందిన భూములు సంబంధం లేని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు సూచించారు. తిరుమలలోని హథీరాంజీ మఠంలో సీజ్ చేసి ఉన్న మహంతు గదిని శనివారం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యవతి, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, మఠం తాత్కాలిక మహంతు ఓం ప్రకాష్ దాస్ తదితరులతో కలిసి రమేష్ నాయుడు తెరిచారు.లోపలున్న కొన్ని వస్తువులను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం రమేష్ నాయుడు మీడియాతో మాట్లాడారు.ఇటీవల మఠానికి తాత్కాలిక మహంతుగా నియమితుడైన ప్రకాష్‌దాస్‌కు నివాసం కోసమే గది తెరిచామన్నారు. మఠం భూముల్లోని ఆక్రమణలను తొలగించే విషయంలో తిరుపతి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందన్నారు.ఆక్రమణలు తొలగించేందుకు తీసుకువెళ్లే పొక్లయినర్ ముందు కూర్చోవడంతో పాటు తమపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు.ఇకనైనా తక్కువ రేటుకు వస్తున్నాయని కష్టపడి సంపాదించిన డబ్బును సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చి మఠం భూములు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఏరోజుకైనా మఠం భూములను స్వాధీనపరుచుకోవడంతో పాటు అందులోని కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.మఠానికి చెందిన భూములపై ధార్మిక పరిషత్ ప్రత్యేక సర్వే టీంను ఏర్పాటు చేసిందన్న ఆయన కబ్జాలో వున్న శాశ్వత నిర్మాణాలపై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు.మఠానికి గతంలో మహంత్‌గా ఉండి సస్పెండైన అర్జున్‌దాస్ తప్పించుకు తిరుగుతున్నారన్నారు.ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి కూడా సహకరించలేదన్నారు. ఈ క్రమంలో కమిటీ అందజేసిన నివేదిక ఆధారంగా అర్జున్‌దాస్‌ను శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు. ఇకపై మఠానికి, ఆయనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.అనధికారికంగా మఠం భూములను ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు ఎంఓయూ కుదుర్చుకున్న ఆయన బంధు మిత్రులను మఠాల్లో వివిధ పోస్టుల్లో నియమించారన్నారు.మఠం నిధులను కూడా దుర్వినియోగం చేశారన్నారు.

ధర్మ పోరాట సభకు అనుమతులున్నాయ్

బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

పుంగనూరు, మార్చి 2: పుంగనూరులో ఆదివారం నిర్వహించనున్న ధర్మపోరాట సభకు అన్ని అనుమతులు ఉన్నాయని బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సభ నిర్వహణకు న్యాయస్థానం నుంచి అనుమతి తెచ్చుకున్నాక పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డికి లేఖ రాశామన్నారు. కొన్ని నిబంధనలతో డీఎస్పీ ఈ సభకు అనుమతి ఇచ్చారని వివరించారు.

మీటింగు అంటే పోలీసు 30 యాక్టే.. : శనివారం పలమనేరులో జరిగిన మీడియా సమావేశంలో పలమనేరు సబ్‌డివిజన్‌లో మార్చి ఒకటో తేది నుంచి నెలాఖరువరకు పోలీసు 30 యాక్టు ఉంటుందని.. మార్చి రెండోతేది ఆదేశాలు జారీ చేసినట్లు డీఎస్పీ వివరించారు. గతంలో రామచంద్రయాదవ్ సదుంలో రెండుమార్లు రైతుభేరి బహిరంగ సభ, చదళ్ల వద్ద బీసీవై ధర్మపోరాట సభ, పుంగనూరులో మెగా జాబ్ మేళా నిర్వహించడానికి ముందురోజు పోలీసు 30 యాక్టును అమలులోకి తేవడం, యాదవ్ పర్యటనల్లో కూడా ఇలాగే చేస్తూ అడ్డుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై కపిలేశ్వరుడు



సూర్యప్రభ వాహనంలో కపిలేశ్వర స్వామి

తిరుపతి (కల్చరల్), మార్చి 2: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శనివారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టణవీధుల్లో వాహన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలిపిరి వద్ద కిక్కిరిసిన వాహనాలు



తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ప్రవేశమార్గమైన అలిపిరి చెక్‌పాయింట్‌లో శనివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. శని, ఆదివారాలు కావడంతో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అలిపిరి వాహనాలతో కిటకిటలాడింది. 30 నిమిషాల నుంచి గంట పాటు అలిపిరిలోనే వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో భద్రతా సిబ్బంది తనిఖీలను వేగవంతం చేశారు. మధ్యాహ్నం తర్వాత రద్దీ తగ్గింది.

పురాణాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించండి

సేవా టికెట్‌తో పాటు గది బుక్‌చేసుకునే అవకాశమివ్వండి - డయల్ యువర్ టీటీడీ ఈవోలో భక్తులు



తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పురాణాలపై పోటీలు నిర్వహిస్తే భక్తిభావం పెరుగుతుందని నిఖిలేష్(నెల్లూరు), దర్శనం, సేవా టికెట్లతో పాటు గదిని కూడా బుక్ చేసుకునే అవకాశమివ్వాలని నాగేంద్ర(గుంటూరు) ఈవో ధర్మారెడ్డికి సూచించారు. ఈవో స్పందిస్తూ.. విద్యార్థులకు భగవద్గీత, అన్నమయ్య, వెంగమాంబ సంకీర్తనలపై పోటీలు నిర్వహించి శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. పురాణాలపై పోటీలను పరిశీలిస్తామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దర్శనం, సేవా టికెట్లు పొందిన భక్తులకు వసతి కూడా అందుబాటులోకి వస్తుందని వివరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 28 మంది భక్తులు ఈవోతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. లడ్డూలు రెండే ఇస్తున్నారని, ప్రతి భక్తుడికీ 10 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రామలక్ష్మి(నంద్యాల) విజ్ఞప్తి చేయగా సాధారణ రోజుల్లో కోరినన్ని లడ్డూలు విక్రయిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో మాత్రమే పరిమిత లడ్డూలు అందజేస్తున్నామన్నారు. ఆలయం ముందున్న టీటీడీ బుక్‌స్టాల్‌లో రూ.111 విలువ కలిగిన గోవింద నామాల పుస్తకాన్ని అడిగితే అక్కడ సిబ్బంది బలవంతంగా రూ.150 చొప్పున రెండు పుస్తకాలు విక్రయించారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. శ్రీవారిని దగ్గరగా చూసే అవకాశమివ్వాలని సుధాకర్(గుంతకల్), రవీంద్ర (హైదరాబాద్) కోరారు. వీఐపీ సిఫార్సులు, శ్రీవాణి ట్రస్టు ద్వారా బ్రేక్ దర్శన టికెట్లతో దర్శనం చేసుకోవచ్చని సూచించారు. తిరుపతి నుంచి తిరుమలకు నామమాత్రపు ధరలకు టీటీడీ బస్సులను నడిపితే బాగుంటుందని వెంకటేష్(హైదరాబాద్) సూచన చేయగా సాధ్యం కాదని ఈవో స్పష్టం చేశారు.

16న జాతీయ లోక్ అదాలత్

కుప్పం, మార్చి 2: కుప్పం కోర్టులో ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ తెలిపారు. కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుప్పం కోర్టులో గత జాతీయ లోక్ అదాలత్‌లో 175 కేసులను రాజీ కుదర్చడం ద్వారా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 11 మండల న్యాయ సేవాధికార కమిటీలు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులక సత్వర న్యాయం జరుగుతుందని చెప్పారు.

వడ్డెర సాధికార సమితి మండల కమిటీల ఏర్పాటు

కుప్పం, మార్చి 2: టీడీపీ వడ్డెర సాధికార సమితి మండల కమిటీలను శనివారం నియోజకర్గ అధ్యక్షుడు మహదేవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నియామకాలు జరిగాయి. కుప్పం మున్సిపల్ అధ్యక్షుడిగా చీగలపల్లె సుబ్రమణి, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల అధ్యక్షులుగా కంచిబందార్లపల్లె బేటప్ప, వెదురుగుట్లలపల్లె చెంగప్ప, తిమ్మసముద్రం మణిలు నియమితులయ్యారు. అనంతరం మహదేవన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వడ్డెర కులాన్ని ఏకతాటిపైకి తీసుకు వచ్చి చంద్రబాబుకు లక్ష మెజారిటీ సాధించడానికి తమ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు, రవి, భానుమూర్తి, రోహిత్, రవికుమార్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల ఉన్నతే పీఈఎస్ ఏకైక లక్ష్యం

- ఛైర్మన్ దొరస్వామినాయుడు



స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న దొరస్వామినాయుడు తదితరులు

కుప్పం, మార్చి 2: వైద్య విద్యార్థుల ఉన్నతే పీఈఎస్ వైద్య కళాశాల లక్ష్యమని ఛైర్మన్ డాక్టర్ ఎమ్మార్.దొరస్వామినాయుడు అన్నారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల 16వ స్నాతకోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఈ ఏడాది వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ విడుదల చేసిన ఫలితాలలో పీఈఎస్ వైద్య కళాశాల మెరుగైన ఫలితాలను సాధించిందని చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమ మాట్లాడుతూ కుప్పంలాంటి మారుమూల ప్రాంతంలో వైద్య కళాశాల ఆసుపత్రి స్థాపించి గ్రామీణ విద్యార్థులకు అత్యున్నత విద్యను అందించడం సామాన్యమైన విషయం కాదన్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా పీఈఎస్ వైద్య విద్యార్థులు వైద్యులుగా స్థిరపడడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ పీఈఎస్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో 162 ఎంబీబీఎస్ విద్యార్థులకు, 89 మంది పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వైద్య వృత్తిలో పాటించాల్సిన ధర్మాలపై పట్టభద్రులచే ప్రతిన చేయించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి

కుప్పం, మార్చి 2: చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి ముడిపడి ఉంటుందని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం బైపాస్ రోడ్డులో గల ఓంశక్తి దేవస్థానంలో శనివారం పూజలు చేసి ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 23, 24 వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలు ముద్రించిన కరపత్రాలను ఓటర్లకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో, వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని ఎవరికి ఓటు వేయాలన్నది ప్రజలు నిర్ణయించుకోవాలని చెప్పారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వీజీ.ప్రతాప్, గోపీనాథ్, రవి, సురేశ్, రామన్, వేణు, భరత్, వినయ్, మునెప్ప, విష్ణు, యశ్వంత్, సతీశ్, సింధు,సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల చింపివేత



కుప్పం, మార్చి 2: కుప్పంలోని టీడీపీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉన్న ఫ్లెక్సీలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఇందులో ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్‌లు కలిసి వున్న 50 అడుగుల భారీ కటౌట్ కూడా ఉంది. దీన్ని అయితే నామరూపాలు లేకుండా చేశారు. మరో చిన్న ఫ్లెక్సీని అడ్డంగా చింపివేశారు. ఇది అధికార పార్టీకి చెందిన దుండగుల పనేనని తెలుగుదేశం వర్గాలు ఆరోపిస్తున్నాయి. టీడీపీకి పెరిగిన జనాదరణ చూసి ఓర్వలేకనే ఇటువంటి దుందుడుకు చర్యలు వారు పాల్పడుతుతున్నారని, అటువంవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని టీడీపీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

పుంగనూరు రూరల్, మార్చి 2: పుంగనూరు మండలం నెక్కొంది ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్తీశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అర్చకులు రాజన్న, సోమశేఖర్, చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్త రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆదివారం గణపతి ప్రార్థన,మృత్సంగ్రహణ, అంకురార్పణ, 4న వృషభయాగం, ధ్వజారోహణం, దిక్పాలకావాహన, బలిహరణ, నిత్యోత్సవం, 5న కలశారాధన, శివాగ్ని ప్రతిష్ఠ, 6, 7తేదీల్లో సాయంత్రం నిత్యహోమం, బలిహరణ, నిత్యోత్సవం, 8న మహాశివరాత్రి రుద్రాభిషేకం, గజవాహనోత్సవం, నాలుగు యామాల పూజ, 9న సింహ వాహనోత్సవం, స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం, 10న రథోత్సవం, 11న దోపోత్సవం, 12న నిత్యహోమం, జయాది హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం వసంతోత్సవం, చూర్ణబలి, శూలస్నానం, మహాకుంభాభిషేకం, ధ్వజ అవరోహణ, 13న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

31లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

పుంగనూరు, మార్చి 2: పట్టణంలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 31వతేది లోపు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ రాయితీ వుంటుందని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సునీత పోరాటానికి అందరూ మద్దతివ్వాలి : అమర్

పలమనేరు, మార్చి2 : ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం జగన్, రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రశ్నించారు. శనివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరగాలని, రాజకీయ లబ్ధికోసమే వివేకానందరెడ్డిని హత్య చేయించారన్న విషయం జగమెరిగిన సత్యమన్నారు. సీబీఐ విచారణ కోసం పిటీషన్ వేస్తామని సునీత అంటే ఎందుకు జగన్ ఆపారో సమాధానం చెప్పాలన్నారు. తన సోదరి సునీత రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు జగన్ అండ్‌కో సమాధానం చెప్పాల్సిన ఆవశ్యకత వుందన్నారు. సునీత చేస్తున్న న్యాయపోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న అమరనాథ రెడ్డి

కుప్పం : వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలని టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు పీఎస్.మునిరత్నం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మొదట ఈ అంశంపై సీబీఐ విచారణ కోరిన జగన్, తర్వాత వద్దనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. సొంత చెల్లెళ్లకే న్యాయం చేయలేనివాడు రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు ఎలా చేస్తారంటూ సునీత్ నిలదీసిన విషయాన్ని గుర్తు చేశారు. అన్నపై సునీత చేస్తున్న న్యాయపోరాటానికి రాష్ట్రంలోని ఐదు కోట్లమందీ పార్టీలకు అతీతంగా మద్దతు పలకాలని, వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డిని ఓడించి తీరాలని ఆయన పిలుపునిచ్చారు.

టీడీపీ అధికారంలోకి వచ్చేది ఖాయం : చల్లా బాబు

సోమల, మార్చి2: రాష్ట్రంలో వైసీపీ పాలన అంతమై త్వరలోనే టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆవులపల్లె పంచాయతీలోని గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ, జనసేన నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం టీడీపీ-జనసేన కూటమి వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమల, చౌడేపల్లె, రొంపిచెర్ల, సదుం మండలాల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రసాద్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, రమణ, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, వేణుగోపాల్ నాయుడు, సోంపల్లె రెడ్డెమ్మ, జయసింహ నాయుడు, భాస్కర్ నాయుడు, కొల్లా హరిప్రసాధ్, పీఎం మల్లికార్జున, శివశంకర్, రఫీ, వినోద్ కుమార్, మహేంద్రబాబు, సతీశ్ నాయుడు, భానుప్రకాశ్, దామోదరం నాయుడు పాల్గొన్నారు.



ఆవులపల్లెలో పర్యటిస్తున్న చల్లా బాబు

ఉపాధి పనులపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు : డ్వామా పీడీ



పుదిపట్లలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

సోమల, మార్చి 2: ఉపాధి హామీ పథకం పనుల్లో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం సోమల మండలంలోని నడింపల్లె వద్ద జరిగిన పనులను పరిశీలించారు. నీటి నిల్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. రైతులకు లబ్ధిపొందే పనులను కూలీలకు కల్పించాలన్నారు. అనంతరం స్త్రీ శక్తి భవనంలో ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజ, ఏపీడీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, మోహన్, సాంబశివయ్య, ఏపీవో దినకర్ బాబు, సర్పంచు కేవీ. రమణ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : డ్వామా పీడీ రాజశేఖర్ శనివారం మండలంలోని పుదిపట్లలో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని, కూలీలందరికీ పనులు కల్పించాలని, ఎండలు అధికమవుతుండటంతో చల్లని సమయాల్లో పనులు చేపట్టాలని సూచించారు.

గంగవరం: మండలంలోని చౌడిరెడ్డిపల్లె, దండపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ రాజశేఖర్ శనివారం పరిశీలించి కూలీలకు అందుతున్న సౌకర్యాలు, బిల్లులపై అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో పుంగనూరు ఏపీడీ నీలిమ, ఏపీవో మురుగేషన్, జేఈ కోదండపాణి, టీఏ వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

జీతాలు అందించే వరకు నిరసన ఆగదు



వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుడుపల్లె, మార్చి 2: జీతాలు ఇచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని ద్రావిడ విశ్వవిద్యాలయం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం ద్రావిడ పరిపాలన భవనం వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గంట పాటు నిరసన వ్యక్తం చేసారు. వారు మాట్లాడుతూ ఐదునెలలుగా జీతాలు అందకపోవడంతో అనేక సమస్యలు పడుతున్నామని వాపోయారు. ఉద్యోగులం దరికి గతంలో చెల్లిస్తున్నట్టుగా సీఎఫ్‌ఎమ్ఎస్ ద్వారా జీతాలు చెల్లించాల న్నారు.

31 వరకు పోలీసు 30 యాక్టు అమలు

పలమనేరు, మార్చి 2: ఈనెల 31 వరకు పోలీసు 30 యాక్టు అమలులో వుంటుందని డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభలు, సమావేశాల అనుమతి కోసం సంప్రదిస్తే సమయం, స్థలం తామే తెలియజేస్తామన్నారు.

కుప్పం : సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే తప్పనసరిగా పోలీసులనుంచి అనుమతి తీసుకోవాలని డీఎస్పీ శ్రీనాథ్ పేర్కొన్నారు. లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

కాపర్ వైర్ దొంగల అరెస్టు

పలమనేరు, మార్చి2 : ట్రాన్స్‌ఫార్మర్లను పగుల గొట్టి అందులోని రాగి వైర్లు దొంగతనాలు చేసే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని, పారిపోయిన మరో వ్యక్తిని కూడా పట్టుకొంటామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పలమనేరు సమీపంలోని కాలువపల్లి అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పలమనేరు ఎస్ఐ శివశంకర్, సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం కాపు కాయగా ఒక మోటరు సైకిల్‌లో ముగ్గురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి ఒకరు దూకి పారిపోగా మరో ఇద్దరు పట్టుబడ్డారని సీఐ తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల సంచిలో ఉన్న 10కిలోల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా ఒకరు తమిళనాడు రాష్ట్రం ఆంబూరు టౌన్‌లో నివాసమున్న ఉస్మాన్ (62), మరో వ్యక్తిది కూడా తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్టు అని, తనపేరు వి. కుమార్ అని తెలిపారన్నారు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండుకు పంపినట్లు సీఐ తెలిపారు.

జోరుగా ప్రారంభోత్సవాలు

వి.కోట, మార్చి 2: వి.కోట పట్టణంలో నూతనంగా వేసిన సీసీ రోడ్లను శనివారం ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ ప్రారంభించారు. కట్టకాలవపై రూ. 25 లక్షలతో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కుప్పం రోడ్డులో రూ. 5లక్షలతో పార్కు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీంఖాన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పీ.ఎన్.నాగరాజ్, సర్పంచ్ పీ.ఎన్.లక్ష్మి, వైస్ సర్పంచ్ అక్మల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 27 మంది ఎంపిక

పుంగనూరు రూరల్, మార్చి2: పుంగనూరు రోటరీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 27మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు క్లబ్ అధ్యక్షుడు అనీల్‌కుమార్ తెలిపారు. శనివారం బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు 75మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరిని బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి మందులు అందివ్వనున్నట్లు వివరించారు. ఆసుపత్రి పీఆర్వో నాగరాజ, రోటరీక్లబ్ ప్రతినిధులు రాజారెడ్డి, డాక్టర్ శరణ్‌కుమార్ రెడ్డి, పూలత్యాగరాజు, భాస్కర్‌శెట్టి, నానబాలగణేశ్, ఆవుల హరిప్రసాద్, వేణుగోపాల్, మునిరాజ పాల్గొన్నారు.

పుంగనూరు తహసీల్దార్ పూతలపట్టుకు బదిలీ

పుంగనూరు, మార్చి2 : రాజంపేట నుంచి బదిలీపై పుంగనూరుకు వచ్చిన తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి నెలరోజులు తిరగకముందే పూతలపట్టు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. 2019 ఎన్నికల సమయంలో పుంగనూరులో పనిచేసిన ఆయనను ప్రభుత్వం గత నెలలో మళ్లీ పుంగనూరుకు బదిలీ చేసింది. వైసీపీకి అనుకూలంగా, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మేలుచేసేందుకే వచ్చారని, ఆయనను పుంగనూరు నుంచి బదిలీ చేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. అలాగే తహసీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డి మంత్రి పెద్దిరెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తారని, ఆయనను ఎన్నికల విధులనుంచి పూర్తిగా తప్పించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు కలెక్టర్ షన్మోహన్ సుబ్రహ్మణ్యంరెడ్డిని పుంగనూరు నుంచి పూతలపట్టుకు, అక్కడ పనిచేస్తున్న శివరాముడును పుంగనూరుకు బదిలీ చేశారు. శనివారం ఇద్దరు తహసీల్దార్లు నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. అయితే మళ్లీ శివరాముడును చౌడేపల్లెకు బదిలీ చేయగా వెదురుకుప్పం తహసీల్దారు శివయ్యను పుంగనూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

పుంగనూరు, మార్చి 2: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరి రమేశ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ కోరారు. శనివారం వారు పుంగనూరులో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కాపాడే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాలను అమలు చేసే నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరముందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉన్నత విద్య చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉందని, విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హేమాద్రి, రాజేశ్, చందు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడితోటకు నిప్పు

పుంగనూరు రూరల్, మార్చి2: మండలంలోని అమ్మిగానిపల్లె, మార్లపల్లె సమీపంలోని సరస్వతమ్మ, మునెమ్మల మామిడితోటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం మామిడి తోటలు కాలుతున్నట్లు సమాచారం మేరకు సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

ఊరకొండకు నిప్పు

సోమల, మార్చి 2: సోమల టీడీటీ కల్యాణ మండపం సమీప ఊరకొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో శనివారం సాయంత్రం నుంచి మంటలు కొండను చుట్టు ముట్టాయి. అటవీశాఖ బీట్ అధికారి రామచంద్ర సిబ్బందితో కలసి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. కొండ దిగువ భాగంలో ఉన్న మామిడి తోటల రైతులు పైపులతో నీళ్లు మళ్లించి మంటలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే కందూరు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై నున్న గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కుప్పం/కుప్పం రూరల్, మార్చి 2: కుప్పం 4వ వార్డు పరిధిలోని కత్తిమానుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త శనివారం మృతి చెందారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అక్కడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చులకుగాను రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే కుప్పం మండలం దాసేగానూరు పంచాయతీ బలమంద కొటాలులో మాజీ సర్పంచి పార్వతమ్మ కుమారుడు, సెక్షన్ ఇన్‌చార్జి నవీన్ శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాంలో మృతి చెందాడు. ఈ కుటుంబాన్ని కూడా పీఎస్.మునిరత్నం పరామర్శించి, మట్టి కర్చులకు రూ.10 వేలు అందజేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కల్లూరు, మార్చి 2: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వ వైద్యాధికారులు జానకీరావు, యల్లయ్య, షమామరెహ్మాన్ తెలిపారు. పులిచెర్ల, ఎల్లంకివారిపల్లి, కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు వైద్యాధికారులు మాట్లాడుతూ ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలన్నారు.

చౌడేపల్లె : డాక్టర్ పూజ ఆధ్వర్యంలో చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులతో కలసి స్థానిక వైద్యసిబ్బంది పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా ఏర్పడ్డారు.

సోమల : ఐదేళ్ల లోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యసిబ్బంది ర్యాలీ జరిపారు. సోమల పురవీధుల్లో విద్యార్థులు, ఆశ కార్యకర్తలతో ర్యాలీ జరిపారు. అలాగే కందూరు, పెద్దఉప్పరపల్లె వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ విజయ లక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీలు జరిపారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ అన్నదానం



కుప్పం, మార్చి 2: ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా తెలుగుయువత నాయకుడు చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో శనివారం కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మురళి, బాలు, సుబ్బు, మంజు, గిరి, సతీశ్, ఉమాశంకర్, సతీశ్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కల్లూరు, మార్చి2: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవోలు శిద్దరామయ్య, పోలక తాతయ్య విద్యార్థులకు సూచించారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం వార్షికోత్సవ వేడుకల, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ముందుగా సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిం చాయి.హెచ్‌ఎంలు ఫజురుల్లా, సయ్యద్‌సాహెబ్‌వల్లి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ నాగరాజప్రసాద్, విశ్రాంత హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ నీటి సరఫరా

పలమనేరు, మార్చి2 :పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిర్మించిన కౌండిన్య రిజర్వాయర్ ఒట్టిపోవడంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. గంటావూరు వద్ద ఉన్న బోర్లనుంచి డిగ్రీకళాశాల వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటిని మళ్లించి అక్కడినుంచి ప్రజలకు నీటి సరఫరా చేపడుతున్నారు. ఈ పనులను శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి, కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు.

8న మహిళా సదస్సు

పలమనేరు, మార్చి2 : పలమనేరు సమీపంలోని కళా మందిరంలో ఈనెల 8వ తేది మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు తెలిపారు. జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో మహిళలు-ఆర్థిక స్వావలంబన అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు వీడ్కోలు



పలమనేరు, మార్చి2 : పలమనేరు మండలంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె. బాలాజీరావు, టి. మణిమాల, బాబూసాహెబ్‌లను శనివారం పలమనేరు ఎంఈవో లీలారాణి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, ఆప్టా తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరు 2వ ఎస్ఐగా సుబ్బారెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి2: పుంగనూరు రెండవ ఎస్ఐగా సుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఉమామహేశ్వర్‌రావు చిత్తూరుకు బదిలీ కావడంతో అప్పటి నుంచి ఖాళీగా ఉంది. ప్రస్తుతం కడప జిల్లా నుంచి బదిలీపై పుంగనూరుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యతో పాటు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

పాతకక్షలతో గొడవ : కేసు నమోదు

పుంగనూరు రూరల్, మార్చి2: పాతకక్షలతో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్ పేట అలగన్నగారివీధికి చెందిన సురేశ్ భార్య ప్రతిభారాణి(39) ఇంటిపై అదే వీధికి చెందిన మధుకుమార్, సుధాకర్ దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పుంగనూరు ఏపీపీగా హరినాథరెడ్డి



పుంగనూరు రూరల్, మార్చి2: పుంగనూరుకు చెందిన సీనియర్ న్యాయవాది హరినాథరెడ్డిని అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి హరీష్‌కుమార్ ఉత్త ర్వులు జారీ చేశారు. స్థానిక ఏఎస్‌జే కోర్టులో అడిషినల్ పీపీగా మూడు సంవత్సరాల కాలం కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు రూరల్, మార్చి2: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ రాఘవ రెడ్డి తెలిపారు. శనివారం వాహనాల తనిఖీ చేస్తుండగా సింగిరిగుంటకు చెందిన బి. వెంకటేశ్(43), సి.నాగరాజ(33) అనుమానంగా కనబడడంతో వారిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద 192 ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సుకుమార్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుల ప్రచారం

సోమల, మార్చి 2: సోమల వారపు సంతలో శనివారం బీజేపీ నాయకులు కేంద్ర పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం గన్నావారిపల్లె, దిడ్డివారిపల్లె, భారతంమిట్ట తదితర ప్రాంతాల్లో ప్రజలకు కరపత్రాలు అందజేసి బీజేపీ ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పుంగనూరు బీజేపీ కన్వీనర్ గన్నా మదన్ మోహన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు శీలం రామూర్తి, నవీన్ రాయల్, రత్నయ్య, సురేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వి.కోట ఎస్ఐగా బాబు

వి.కోట, మార్చి 2: వి.కోట అర్బన్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా ఎస్.బాబు శనివారం బాధ్యతలు స్వీరించారు. ఇక్కడ గతంలో పనిచేస్తున్న మనోహర్‌కు సీఐగా పదోన్నతి రాగా, ఆయన అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిత్తూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న బాబు వి.కోటకు బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అధికారం కోసం మళ్లీ జగన్ కుట్రలు: టీడీపీ



ర్యాలీ చేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, మార్చి 2: రానున్న ఎన్నికల్లో అధికారం కోసం సీఎం జగన్‌రెడ్డి మళ్ళీ కుట్రలు చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, మండల టీడీపీ కోఆర్డినేటర్ శివప్రసాద్ ఆరోపించారు. మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాశేపల్లెలోని పలువీధుల్లో కొత్తఓటర్లను పలువురిని కలిసి టీడీపీకే ఎందుకు ఓటువేయాలి, వైసీపీకి ఎందుకు ఓటు వేయరాదు అనే విషయాలను శనివారం రాత్రి నేతలు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలయికతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ప్రజారంజక పాలన సాగిస్తారని తెలిపారు. టీడీపీ నేతలు వెంకటేష్ నాయుడు, తులసిరెడ్డి, సోమశేఖర్ నాయుడు, నరసింహులు, ఉమాపతి, రాము, రాజు, సుబ్రమణ్యం, సుందరరాజ్, మునిరత్నం పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మురళీమోహన్ తదితరులు

తవణంపల్లె, మార్చి 2: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని ఎ.గొల్లపల్లె పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, వెంకటేష్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు షబ్బీర్, ప్రవీణ్, సుభాష్, నవీన్ పాల్గొన్నారు.

డాక్టర్ థామస్‌ను గెలిపించండి: గంధమనేని

శ్రీరంగరాజపురం, మార్చి 2: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చిల్లామాకులపల్లి పంచాయతీలోని గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి, టీడీపీ నాయకులు చిన్నబ్బరాజులు, నాగారాజు, లోకేష్‌రెడ్డి, సిద్ధయ్యశెట్టి, బాలాజీ నాయుడు, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, శ్రీహరిరెడ్డి, భాస్కర్ నాయుడు, లోకనాధం, జనసేన నాయకులు చార్లెస్, చందు పాల్గొన్నారు.

గట్రాళ్ళమిట్టలో బాబు ష్యూరిటీ...

గుడిపాల, మార్చి 2: రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు వాసుదేవ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గట్రాళ్ళమిట్టలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధితులను పరామర్శిస్తున్న భానుప్రకాష్

నగరి, మార్చి 2: నగరి మున్సిపాలిటీ పరిధిలోని నెత్తం కాలనీకి చెందిన రాసాత్తికి చెందిన పూరిల్లు దగ్ధం కావడంతో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్ శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో కట్టుబట్టలతో బాటు ఇంట్లోని అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు భానుప్రకాష్‌కు బాధితురాలు తెలిపారు. భర్త చనిపోయి ముగ్గురు పిల్లలను ఒంటరిగా సాకుతున్న రాసాత్తికి ఇల్లు కాలిపోవడంతో రోడ్డున పడ్డట్లయింది. బీరువాలోని డాక్యుమెంట్లు సైతం పూర్తిగా కాలిపోయాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వం ద్వారా వచ్చే సాయాన్ని బాధితులకు అందించాలని ఆయన కోరారు.

మృతులకు భానుప్రకాష్ నివాళి

విజయపురం, మార్చి 2: మండలంలోని మహావీరపురంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన మణి భౌతిక కాయానికి నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోతురాజులు కండ్రిగలో మృతి చెందిన దాసరి కృష్ణమ నాయుడు, కొత్త ఇళ్లత్తూరులో మృతి చెందిన వెంకటరాజు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసులో లోతైన విచారణ చేపట్టాలి
- పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్

తవణంపల్లె, మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలతో లోతైన విచారణ చేపట్టాలని పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ తన చెల్లెలికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని మహిళలకు ఎంత వరకు న్యాయం చేస్తారన్నారు. తన తండ్రి హత్య కేసులో సునీత అడిగిన ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలన్నారు. ఈహత్య కేసులో సీబీఐ విచారణ కోరిన జగన్ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే కేసును ఎలా వెనుకకు తీసుకొంటారని ప్రశ్నించారు. వివేకా కుమార్తె సునీతకు అండగా టీడీపీ న్యాయ పోరాటం చేస్తుందన్నారు. మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, నాయకులు సునీల్, మధు, శరవణ, నవీన్, షబ్బీర్ ఆలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిపాత్రపై విచారణ జరపాలి: భానుప్రకాష్

నగరి, మార్చి 2: వైఎస్ వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరిగేలా చూడాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ శనివారం ఓ పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం వివేకానందరెడ్డిని జగన్‌రెడ్డి ముఠానే హతమార్చి ఏమీ తెలియనట్లు తమ బాబాయి గొడ్డలిపోటుతోనే చనిపోయాడని ఖచ్చితంగా చెప్పడంలోనే ఆయన పాత్ర ఏమాత్రముందో తెలుస్తోందని దుయ్యబట్టారు. న్యాయ పోరాటంలో సునీతకు టీడీపీ అండగా నిలుస్తుందని, రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు సునీత పిలుపు మేరకు వైసీపీని ఓడించి న్యాయానికి మద్దతు పలకాలని భానుప్రకాష్ కోరారు.

శంఖారావం సభా ప్రాంగణ ఏర్పాట్లు
పరిశీలించిన టీడీపీ నేతలు

నగరి, మార్చి 2: నగరి పట్టణ పరిధిలో మార్చి 9వ తేదీన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొనే శంఖారావం సభా ప్రాంగణాన్ని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ శనివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. దేశమ్మ దేవాలయ సమీపంలో గతంలో వున్న పార్‌కిన్స్ టెక్స్‌టైల్స్ ప్రాంతంలో గల మైదానాన్ని శంఖారావం సభ నిర్వహణకు ఎంపిక చేశారు. సభా ప్రాంగణాన్ని శుభ్రం చేయించి, తగు ఏర్పాట్లు చేయడంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, స్థానిక నాయకులు తల మునలకలై ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, పురుషోత్తం నాయుడు, రమేష్‌రాజు, శివకుమార్‌రెడ్డి, పరంధామ నాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడిగా
సల్లా శివశంకర్



సల్లా శివశంకర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య పెద్దలు

ఐరాల(కాణిపాకం), మార్చి 2: చిత్తూరు జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడిగా కాణిపాకానికి చెందిన సల్లా శివశంకర్ శనివారం నియమితులయ్యారు. ఆయన్ను అనంతపురం జిల్లా హిందూపురంలో ఎన్నుకున్నారు. జిల్లాలోని ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

బాధిత కుటుంబానికి నగదు పంపిణీ



నగదు పంపిణీ చేస్తున్న నాయకులు

విజయపురం, మార్చి 2: మండలంలోని మిట్టూరులో షార్టు సర్క్యూట్‌కు పూరిల్లు దగ్ధమై వీధిన పడిన అశోక్ కుటుంబానికి తహసీల్దార్ మల్లికార్జున రావు స్పందించి సర్పంచ్ జపమేరీ ప్రసన్నకుమార్, ఎంపీటీసీ రాజగోపాల్ చేతుల మీదుగా 25 కేజీల బియ్యం, నాలుగు కేజీలు పప్పు, రూ.8 వేలు నగదు పంపిణీ చేశారు. వీధిన పడిన కుటుంబానికి తమవంతు సాయం అందించినట్టు తెలిపారు. మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, వీఆర్వో మేఘనాథం, నాయకులు పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే జీజేఎం లక్ష్యం

గుడిపాల, మార్చి 2: నిరుపేద ప్రజల శ్రేయస్సే జీజేఎం లక్ష్యమని నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. శనివారం పల్లూరులో దళితులు తమిళనాడులోని వేళాంగానికి విహారయాత్రకు వెళ్ళడానికి అన్ని ఖర్చులు భరించి పంపారు. ఈ కార్యక్రమంలో హేమాద్రి నాయుడు, మధుసూదన నాయుడు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

నగరి, మార్చి 2: నగరి మండల పరిధిలోని దామరపాకం పంచాయతీలో పలు అభివృద్ధి పనులను శనివారం మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించారు. దామరపాకం సచివాలయ పరిధిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గడప, గడపకు నిధులు రూ.10.80 లక్షలతో సిమెంటు రోడ్లను, రూ.9.52 లక్షలతో నిర్మించిన జలజీవన్ మిషన్ పథకాన్ని, మండల నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, సర్పంచి రవికుమార్, నాయకులు బుజ్జిరెడ్డి, తిరుమలరెడ్డి పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

యువకులతో ఆత్మీయ సమావేశం

చిత్తూరు, మార్చి 2: వైఎస్సార్ యువజన విభాగం ఆత్మీయ సమావేశాన్ని శనివారం మురకంబట్టులోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. వైసీపీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరయ్యారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీరెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రి పాల్గొన్నారు. కాగా శనివారం మండలంలోని పేయనపల్లి పంచాయతీలో వైసీపీ ఎన్నికల ప్రచారాన్ని విజయానందరెడ్డి నిర్వహించారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి: ఎస్పీ



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ

చిత్తూరు, మార్చి 2: పోలీసుశాఖలో సుదీర్ఘకాలం పాటు పని చేసి పదవీ విరమణ పొందిన వారంతా మిగిలిన శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని చిత్తూరు ఎస్పీ జాషువా కోరారు. శనివారం పోలీసు అతిథి గృహంలో పదవీ విరమణ పొందిన కాణిపాకం ఏఎస్ఐ ఆర్ముగం, ఆర్మ్‌డ్ రిజర్వు ఎస్ఐ సెల్వరాజ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 40ఏళ్లపాటు అంకితభావంతో పోలీసుశాఖకు చేసిన సేవను ఎప్పుడూ గుర్తించుకుంటామన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాషా, ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుంభాభిషేక పూజలు

చిత్తూరు కల్చరల్, మార్చి 2: నగరంలోని గొడుగుమూరు సీతారామాంజనేయ భజన మందిరం కుంభాభిషేక మండల పూజలు శనివారంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు భజన కళాకారులచే బృందగానాలు, పిల్లనగ్రోవి, డప్పుల సవ్వడులతో పాటు హరికథా, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో భజనమందిరంతో పాటు ఇంటింటా దీపారాధనలు చేశారు. స్వామివారి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.

పేరుకే నాడు - నేడు పనులు

- పెచ్చులూడుతున్న పశుమంద ప్రాథమిక పాఠశాల గదులు
- నిరసన తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు





నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెచ్చులూడుతున్న ప్రాథమిక పాఠశాల

గుడిపాల, మార్చి 2: మండలంలోని వసంతాపురం పంచాయతీ పశుమంద ప్రాథమిక పాఠశాలలోని గదులు పైపెచ్చులూడి నేడో రేపో కూలడానికి సిద్ధంగా ఉన్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా గదుల్లో పైపెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం పాఠశాలకు మరమ్మతు పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవో-2 గణపతి పాఠశాలను పరిశీలించి, మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.

పోలియోపై విజయానికి రెండు చుక్కలు

- నగర మేయర్ అముద, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి
- నేడు పల్స్ పోలియో
- 2,09,971 మంది పిల్లల గుర్తింపు



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు

చిత్తూరు రూరల్, మార్చి 2: రెండు చుక్కలతో పోలియోపై విజయం సాధించవచ్చునని చిత్తూరు నగర మేయర్ అముద, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి అన్నారు. ఆదివారం జరుగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కోసం శనివారం ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జెండా ఊపీ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం అర్హులైన ప్రతి ఒక్కరు పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. భారత్ పోలియో లేని దేశంగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటించిందన్నారు. అయినా మరలా పోలియో దేశంలోకి అడుగు పెట్టకుండా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 0-5 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు తప్పక వేయించాలన్నారు. అనంతరం డీఐవో రవిరాజు, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్‌లు మాట్లాడుతూ జిల్లాలో 2,09,971 మంది 0-5 సంవత్సరాలు లోపు పిల్లలు ఉన్నారని గుర్తించామన్నారు. 1415 బూత్‌ల్లో ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆదివారం మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డాక్టర్లు హర్షవర్ధన్, లోకేష్, శిరీష, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: ఐరాలలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలం అక్కనగారిపల్లెలో నిర్వహించిన ర్యాలీలో హెచ్‌ఎం గంగాధరం, విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో జరిగిన ర్యాలీలో డాక్టర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు గీత, పచ్చికాపల్లం హెల్త్ అసిస్టెంట్ వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కార్వేటినగరం: కత్తెరపల్లెలో పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో డాక్టర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాలసముద్రం వరకు విద్యార్థులు, వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ మోహన్‌కృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యాదమరి: కె.గొల్లపల్లె విద్యార్థులు కాశిరాళ్లలో నిర్వహించిన ర్యాలీలో హెచ్‌ఎం లలిత, టీచర్లు, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, అంగన్‌వాడీ వర్కర్ పాతిమా తదితరులు పాల్గొన్నారు. యాదమరి పీహెచ్‌సీ వద్ద డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, పల్స్‌పోలియో ప్రచార రథాన్ని ప్రారంభించారు. పలువురు సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం: గురజాల



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 2: టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరమూ పనిచేద్దామని పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండల నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ళుగా చాలా మంది పార్టీ నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టిందని, ఎన్నికలు దగ్గరపడటంతో రానున్న రోజుల్లో కీలకమైన పార్టీ నేతలు, కార్యకర్తలపైకూడా మరిన్ని కేసులు పెట్టే అవకాశం ఉందని జాగ్రత్తపరిచారు. ఎలాగైనా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. చంద్రప్రకాష్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమైనవని చెప్పారు. గురజాల జగన్మోహన్ విజయానికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కటారి హేమలత, సీఆర్ రాజన్, కాజూరు బాలాజీ, జయచంద్ర నాయుడు, శశికర్ బాబు, మోహన్‌రాజ్, మేషాక్, మంజూస్, దేవరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటా

పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటానని గురజాల జగన్మోహన్ భరోసా ఇచ్చారు. శనివారం నగరంలోని 8వ డివిజన్ వెంగళ్రావు కాలనీ, శ్రీనివాస నగర్‌లోని ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్న కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు కటారి హేమలత, త్యాగరాజన్, వరలక్ష్మి, జాఫర్, డివిజన్ ఇన్చార్జ్ ప్రియాంక, ఐశ్వర్య, సిరి, నీలమ్మ, ప్రమీళ, హరి, మురళి, క్రిష్ణయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షురాలిని కలసిన డీసీసీ అధ్యక్షుడు



పీసీసీ అధ్యక్షురాలితో డీసీసీ అధ్యక్షుడు

వెదురుకుప్పం, మార్చి 2: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను శనివారం డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తిరుపతిలో కలిశారు. ఈ క్రమంలో ఆమెకు వీడ్కోలు పలికారు. శనివారం ఆయన వెదురుకుప్పంలో మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని షర్మిల సూచించినట్లు చెప్పారు. పార్టీ కేడర్‌కు ఆమె భరోసా ఇచ్చారని తెలిపారు. జిల్లాలో పార్టీ ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని, రాబోవు ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా బరిలో నిలవడానికి ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. తాను కూడా జిల్లాలో ఓ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు.

బ్యాంకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

కార్వేటినగరం, మార్చి 2: విద్యార్థులు బ్యాంకులో జరిగే ఆర్థిక లావాదేవీలు, నగదు డిపాజిట్, రుణాలపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రోహిత్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాలలో భాగంగా చిత్తూరు జిల్లా లీడ్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరీష్ ఆధ్వర్యంలో ఆర్థిక వనరులపై అవగాహన కల్పించే క్విజ్ పోటీలను నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, సుబ్బారావు, హరిబాబు, జోగి ప్రసాద్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరి: కొద్దిపాటి ఆర్థిక అవగాహన వ్యక్తిని, కుటుంబాన్ని కష్టాల పాలు కాకుండా చూస్తుందని నగరి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల, విడ్స్ స్వచ్ఛందసంస్థ సంయుక్తంగా ఆర్థిక అక్షరాస్యత, అవగాహనా కార్యక్రమాన్ని శనివారం కళాశాలలో నిర్వహించారు. ఎన్‌సీసీ లెఫ్టనెంట్ భాస్కర్, విడ్స్ కోఆర్డినేటర్ భాను, సుహాసిని, మునికుమారి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే సభలు, ర్యాలీలు నిర్వహించొద్దు: డీఎస్పీ

నగరి, మార్చి 2: నగరి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో, పట్టణంలో పోలీస్ యాక్ట్ 30, 30(ఏ) అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించరాదని డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. నగరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి, భద్రతల దృష్ట్యా 30, 30(ఏ) యాక్టులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 31వతేదీ వరకు ఈ యాక్టు కొనసాగుతుందని అన్నారు. అనుమతులు పొందకుండా సభలు, సమావేశాలు నిర్వహించడం, ర్యాలీలు, రాస్తారోకోలు చేయడం, మైక్‌లు ఏర్పాటు చేయడం నిషిద్ధమన్నారు. కార్యక్రమంలో నగరి సీఐ సురేష్ పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై కార్మికులకు శిక్షణ

చిత్తూరు, మార్చి 2: సరైన శిక్షణ పొందడం వల్ల ఘన వ్యర్థాల నిర్వహణను పక్కాగా, సులభంగా చేయవచ్చని ఎంహెచ్‌వో లోకేష్ చెప్పారు. తడి, పొడి వ్యర్థాలపై శనివారం నగరపాలక కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యర్థాలను పూర్తిస్థాయిలో సెగ్రిగేషన్ చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణను సులభంగా చేపట్టవచ్చని వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై రీసోర్స్ పర్సన్ మస్తానయ్య పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. వ్యర్థాల రకాలు, వాటిని వేరు చేయడంపై ప్రత్యక్షంగా చూపించి కార్మికులతో చేయించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

మెరుగ్గా పారిశుధ్య కార్యక్రమాలు: మేయర్

చిత్తూరు, మార్చి 2: నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు మరింత మెరుగ్గా చేపట్టాలని నగర మేయర్ అముద అన్నారు. శనివారం ఆమె నగరంలోని 5వ వార్డు సచివాలయ పరిధిలోని విజయానగర్, మురుగానిపల్లె రోడ్డు, కామేశ్వర్ నగర్‌లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వీధుల్లో ఎక్కడా వ్యర్థాలు కనిపించకూడదని, క్రమం తప్పకుండా ప్రతి రోజూ పనులు చేయాలన్నారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

వెదురుకుప్పం, మార్చి 2: చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని వెదురుకుప్పం ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. మండలంలో ఎక్కడైనా సారా తయారీ, విక్రయాలు, అమ్మకాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

4, 5వ తేదీల్లో ఎన్నికల నిర్వహణపై శిక్షణ

గంగాధరనెల్లూరు, మార్చి 2: ఈనెల 4, 5వ తేదీల్లో చిత్తూరు జడ్పీ మీటింగ్ హాలులో జరిగే ఎన్నికల శిక్షణ సమావేశానికి హాజరుకావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి. వెంకటశివ పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4వతేది సోమవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులకు ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. 5వ తేదీ మంగళవారం ఉదయం 11గంటలకు ఈఎస్ఎంఎస్‌పై ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, టీమ్ సభ్యులకు, చెక్‌పోస్ట్ సిబ్బంది, సెబ్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 12గంటలకు కమిషనర్, ఆర్వో, ఎంపీడీవోలు, తహసీల్దార్లుకు ఎన్నికలపై శిక్షణ సమావేశం జరుగుతుందని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్‌పై అడిషనల్ మైక్రో అబ్జర్వర్స్, ఆర్వో, ఏఆర్వోలు, కమిషనర్, ఎంపీడీవోలు, హెచ్ఎస్‌వోలకు శిక్షణ ఉంటుందని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రవి, ఎన్నికల డీటీ విజయకృష్ణ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకోండి

ఐరాల, మార్చి 2: కేంద్ర ప్రభుత్వం చేతివృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు విశ్వకర్మ పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈపథకం ద్వారా 12 రకాల చేతి వృత్తుల వారికి రూ.3 లక్షల ఆర్థిక సహకారంతో పాటు పనిముట్లు అందించనున్నారు. స్థానిక కామన్ సర్వీసు సెంటరు(సీఎస్సీ) లో 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న ఆయా వృత్తుల వారికి వారం రోజుల పాటు శిక్షణ అందిస్తూ రూ.3,500 ఆర్థిక సహాయం అందిస్తుంది. వివరాల కోసం సీఎస్సీ నిర్వాహకుడు షేక్‌ఖయ్యూం 9014362797ను సంప్రదించాలని తెలిపారు. అలాగే గృహాలకు 300 యూనిట్ల కంటే తక్కువ బిల్లు వచ్చే వారు సబ్సిడీతో ఇంటి పైకప్పుల సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవచ్చునని ఖయ్యూం తెలియజేశారు.

పూతలపట్టు తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యం రెడ్డి

పూతలపట్టు, మార్చి 2: పూతలపట్టు తహసీల్దార్‌గా ఎం.వి. సుబ్రహ్మణ్యం రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శివరాముడు బదిలీపై పుంగనూరుకు వెళ్ళడంతో ఆయన స్థానంలో సుబ్రహ్మణ్యం రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి: డీపీవో

పాలసముద్రం, మార్చి 2: మండలంలోని బృందావనాల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలని డీపీవో లక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో వున్న బృందావనాన్ని తనిఖీ చేసి, చెత్త నుంచి తయారుచేసిన ఎరువులను పరిశీలించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎరువులను తయారుచేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రతి పంచాయతీలో వీధి దీపాలు, సక్రమంగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ నాయుడు, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, మార్చి 2: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నక్యాంటీన్‌లో శనివారం నలగాంపల్లికి చెందిన ఎన్ఆర్ఐ విక్రమ్ చౌదరి గృహప్రవేశం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ గౌడ్, లోకనాథం నాయుడు, చందు, వినయ్ కుమార్, జాకీర్ హుస్సేన్, సురేంద్ర నాయుడు, సుదర్శన్ నాయుడు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల, మార్చి 2: మండలంలోని అన్నక్యాంటీన్‌లో శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లి రవి నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, టీడీపీ నాయకులు ఆనంద్ యాదవ్, కిట్టు, గోవిందు గౌడ్, ఐజాక్, మురళీ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద...

కార్వేటినగరం, మార్చి 2: కార్వేటినగరం టీటీడీ అనుబంధ ఆలయామైన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేసేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయాధికారి సురేష్‌కుమార్ కోరారు.